వికారాబాద్, సోమవారం 6 నవంబర్ 2023





ఆమనగల్లులో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, పార్టీ ప్రజాప్రతినిధులు





# కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలే..

## ఆలోచించి ఓటేయండి.. జైపాల్‌యాదవ్‌ను గెలిపించండి

- బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే అభివృద్ధి, సంక్షేమం వైపునకు..
- జవహర్‌లాల్ నెహ్రూ నుంచి ఇందిరాగాంధీ వరకు తెలంగాణకు అన్యాయమే..
- కర్ణాటకలో కాంగ్రెస్‌ను ఈసడించుకుంటున్న జనం
- ఉవ్వెత్తున ఉద్యమం చేసి ఢిల్లీ దొరల తలలు వంచాం
- రాష్ట్రం సిద్ధించాక సాగునీటి రంగంలో వినూత్న విప్లవాన్ని తీసుకొచ్చాం
- గిరిజన తండాలను గ్రామ పంచాయతీలను చేశాం
- ఆమనగల్లులో ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్

కల్వకుర్తి / ఆమనగల్లు, నవంబర్ 5: తెలంగాణ బిడ్డలను అరిగోస పాల్జేసిన ఢిల్లీ దొరల పాలన కావాలా... అభివృద్ధి, సంక్షేమ పాలననిచ్చే కేసీఆర్ కావాలా అని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే రాష్ట్రం మళ్లీ అంధకారంలోకి వెళ్తుందని, విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన అశేష జనవాహిని ఉద్దేశించి మంత్రి కేటీఆర్ మాట్లాడారు. దొరల తెలంగాణ అంటూ రాహుల్ గాంధీ మాట్లాడిన తీరుపై ఆయన విరుచుకు పడ్డారు. అసలు ఢిల్లీ దొరలు మీరు.. తెలంగాణకు ఆది నుంచి అన్యాయం చేసింది మీరు, మీ ముత్తాత జవహర్‌లాల్ నెహ్రూ నుంచి మీ నాయినమ్మ ఇందిరాగాంధీ వరకు తెలంగాణకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. 1956లో తెలంగాణను ఆంధ్ర ప్రాంతంలో విలీనం చేసి తెలంగాణ యాస భాష, సంస్కృతి, సంపదను కొల్లగొట్టారు. 1969లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమం సాగుతుంటే 369 మంది విద్యార్థులను బలితీసుకున్నారు. 2004 నుంచి 2014 వరకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించిన వందలాది తెలంగాణ బిడ్డల ప్రాణాలు బలికొన్నది ఎవరు అని కేటీఆర్ ప్రశ్నించారు. 1956నుంచి తెలంగాణను చెరబట్టిన ఢిల్లీ దొరల కాంగ్రెస్ పార్టీ కాదా.. అంటూ మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలను పణంగా పెట్టి కేసీఆర్ ఉద్యమం సాగించారని, ఉద్యమ ఫలితంగానే ఢిల్లీ దొరలు తలవంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేశారని మంత్రి కేటీఆర్ గుర్తు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించిందని ఆయన పేర్కొన్నారు.

**కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరిగిన మంత్రి కేటీఆర్..**

సభలో కేటీఆర్ కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరిగారు. పక్క రాష్ట్రాలనుంచి నాయకులను అరువు తెచ్చుకుని ప్రచారం నిర్వహిస్తున్న మీరు నాయకులేనా అంటూ మండిపడ్డారు. డబ్బు సంచులతో ప్రజలను వంచనకు గురి చేస్తున్నారని దుయ్యబట్టారు. కర్ణాటక రాష్ట్రం నుంచి అరువు తెచ్చుకున్న మీ పార్టీ నాయకుడు, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి శివకుమార్ మాట్లాడిన మాటలతో తెలంగాణ బిడ్డలు నవ్వుతున్నారని ఎద్దేవా చేశారు. డికె శివకుమార్ వ్యవసాయానికి కర్ణాటకలో 5 గంటల కరెంటు ఇస్తున్నామని, తెలంగాణలో కూడా 5 గంటల కరెంటు ఇస్తామని చెప్పిన ప్రసంగాలతో కాంగ్రెస్ నాయకులను ఈసడించుకుంటున్నారని కేటీఆర్ కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే కరెంటు ఉండదు, ఎరువుల విత్తనాల కొరకు లైన్లు తప్పవని, పెట్టుబడి సాయం రైతు బంధుకు చరమగీతం పాడుతారని హెచ్చరించారు.

**కేసీఆర్‌ను ఢీకొట్టేందుకు..**

సీఎం కేసీఆర్‌ను ఢీ కొట్టేందుకు ఢిల్లీ నుంచి కాంగ్రెస్, బీజేపీ నేతలు తండొపతండాలుగా వస్తున్నారని, ప్రజా బలం ఉన్న కేసీఆర్‌ను ఎవ్వరూ ఏం చేయలేరని కేటీఆర్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అస్త్ర సన్యాసం చేశాడని ఎద్దేవా చేశారు.

అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందని చెప్పారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలను చేశామని, గిరిజన రిజరేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచామని గుర్తు చేశారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓట్లు వేయాలని. తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే మీ భవితే అంధకారం అవుతుందని కేటీఆర్ సూచించారు. జైపాల్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే ఆమనగల్లుకు రెవెన్యూ డివిజన్, ఎంవీఐ కార్యాలయం, డీఎస్పీ కార్యాలయంతో పాటు, గట్టుప్పలపల్లి, వెల్జాల్, రఘుపతిపేట మండలాలను ఏర్పాటు చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. అంతకుముందు కేటీఆర్‌కు బీఆర్‌ఎస్ నేతలు గధ, గొంగడి, గొర్రెపిల్లను బహూకరించారు. సభకు వచ్చిన నాగం జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ, డబ్బు మూటలతో వచ్చిన కాంగ్రెస్ నాయకులను నమ్మవద్దని సూచించారు. రాత్రికి రాత్రే కాంగ్రెస్ పార్టీ డబ్బు సంచులతో వచ్చిన ప్యారాచూట్ నేతలకు ఓట్లు వేయవద్దని నాగం పిలుపునిచ్చారు. అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీకి చెందిన అభ్యర్థి డబ్బు సంచులతో ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తున్నారని మండిపడ్డారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, జడ్పీటీసీలు అనురాధ. దశరథ్‌నాయక్, విజితారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, ఎంపీపీలు నిర్మల, మనోరమ, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ తోట గిరియాదవ్, వైస్ ఎంపీపీలు అనంతరెడ్డి, ఆనంద్, వివిధ మండల, పట్టణ అధ్యక్షులు అర్జున్ రావు, నేనావత్ పత్యానాయక్, కంబాల పరమేశ్, నిట్ట నారాయణ, ఎంపీటీసీలు కుమార్, సరిత, కౌన్సిలర్ కమఠం రాధమ్మ, సర్పంచ్‌లు లక్ష్మీ నర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్, శ్రీనివాస్, వెంకటయ్య, రఘు, రామకృష్ణ, సాయిలు, సుభాష్, జహంగీర్ యువజన విభాగం నాయకులు కొమ్ముప్రసాద్, వెంకటేశ్, కిరణ్, కృష్ణ, సతీశ్, రమేష్, భాస్కర్, రంజిత్, యాదయ్య, హనీఫ్, అక్బర్, అప్సర్, మైసయ్య, వెంకటయ్య, శివ, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.









ఆమనగల్లులో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం



షాద్‌నగర్ జరిగిన రోడ్డు షోలో పాల్గొన్న జనం



రోడ్ షోలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

**అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటు వేయండి**

**అంజయ్యయాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి**

**- షాద్‌నగర్ రోడ్డు షోలో మంత్రి కేటీఆర్**

**- రోడ్డు షోకు పోటెత్తిన జనం**

ఢిల్లీ, గుజరాత్ గుంపునకు..

# తెలంగాణ ప్రజల సత్తా చూపిస్తాం

షాద్‌నగర్, నవంబర్ 5: తెలంగాణ ప్రజల సత్తా ఏమిటో ఈ నెల 30న గుజరాత్, ఢిల్లీ సామంతులకు తెలుస్తుందని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కె. తారకరామారావు అన్నారు. ఆదివారం రాత్రి షాద్‌నగర్ పట్టణంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వై. అంజయ్యయాదవ్‌కు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల రోడ్డు షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2014, 2018 ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేసి గెలిచామని, మరోమారు గెలిచి మన సత్తా ఏమిటో ఢిల్లీ, గుజరాత్ గుంపునకు తెలుపుదామని అన్నారు. అంజయ్యయాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మొదటి నుంచి తెలంగాణ ప్రజలకు మోసం చేస్తున్న పార్టీలను ఎట్టిపరిస్థితిలోనూ నమ్మొద్దని, తెలంగాణ ఇవ్వకుండా తెలంగాణను ఆగంచేసింది ఢిల్లీ దొరలు కాదా ? అని ప్రశ్నించారు. తెలంగాణ వస్తే మనం నష్టపోతం అని ముచ్చట్లు చెప్పిన నాయకులకు తెలంగాణ అభివృద్ధి కండ్లకు కనిపిస్తలేదా ? అని ప్రశ్నించారు. సాగునీరు, కరెంట్, మంచి నీళ్లు వంటి ఎన్నో వసతులు వచ్చాయని, రానున్న రోజుల్లో పాలమూరు ఎత్తిపోతల ద్వారా షాద్‌నగర్ భూములకు నీళ్లు పారుతాయని స్పష్టం చేశారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతోనే షాద్‌నగర్ ప్రాంతంలో ఐటీ పరిశ్రమలను నెలకొల్పుతామని హామీఇచ్చారు. గిరిజనుల కోరిక మేరకు అనువైన ప్రతిచోట సేవాలాల్ మందిరాలను నిర్మించేందుకు తమవంతుగా కృషిచేస్తామని అన్నారు. నరేంద్రమోదీ సిలిండర్ ధరలు పెంచితే సీఎం కేసీఆర్ రూ. 400 లకే వంట గ్యాస్ సిలిండర్ ఇస్తారని చెప్పారు. రాష్ట్రంలోని 93 లక్షల కుటుంబాలకు బీమా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని వివరించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో నాలుగు మెడికల్ కళాశాలలను నిర్మించిన ఘనత కూడా బీఆర్‌ఎస్‌కే దక్కిందని చెప్పారు. మంత్రి కేటీఆర్ రోడ్డు షోకు షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బీష్వ కిష్టయ్య, బీఆర్‌ఎస్ మాజీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఎస్‌డీ ఇబ్రహీం, మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్. నటరాజన్, పీఏసీఎస్ చైర్మన్ మంజూల, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ నవీన్‌కుమార్‌రెడ్డి, నాయకులు, నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలు**

ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్ సమక్షంలో పలువురు కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ నవీన్‌కుమార్‌రెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి, కాంగ్రెస్ నాయకుడు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, షాద్‌నగర్ కాంగ్రెస్ కౌన్సిలర్ శాంతమ్మ, కొత్తూరు కౌన్సిలర్లు మాదారం నర్సింహాగౌడ్, అనీతాశ్రీనివాస్‌గౌడ్, సోమ్లానాయక్, మాధవీ గోపాల్ గౌడ్, ఎంపీటీసీలు కృష్ణయ్య, జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మాదారం కృష్ణగౌడ్, కాంగ్రెస్ చౌదరిగూడ మండల అధ్యక్షుడు సుధాకర్, మంగులాల్‌నాయక్, కాంగ్రెస్ నాయకుడు సుజీవన్, యువజన కాంగ్రెస్ నాయకులు బీఎస్ సుధీర్, శ్రీకాంత్‌గౌడ్‌లతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.